జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





# ఇసుకాసురుల.. రౌడీయిజం..!

**☀ ఇది మా ప్రభుత్వం.. ఏం చేసుకుంటారో చేసుకోండి ☀ పురుషోత్తపురం ర్యాంపులో లెక్కకు మించి ఇసుక తవ్వకాలు ☀ నకిలీ బిల్లులతో తరలింపు ☀ ర్యాంపులో కొందరు టీడీపీ నేతల గూండాగిరి ☀ కొత్తవ్యక్తులు ఇసుక ర్యాంపునకు వెళితే బెదిరింపులు ☀ నిత్యం పదుల సంఖ్యలో ఇసుక విశాఖ వైపు తరలింపు ☀ భారీ ఇసుక వాహనాల వల్ల అధ్వానంగా మారిన గ్రామీణ రహదారులు ☀ జాతీయ రహదారిలో సర్వీసు రోడ్లు ఎక్కడికక్కడ గోతులు ☀ రాత్రుళ్లు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు ☀ వంశధార నదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాల వల్ల మారుతున్న ప్రవాహ దిశ ☀ ఆందోళన వ్యక్తం చేస్తున్న నదీపరివాహక ప్రాంత ప్రజలు ☀ నెలవారీ మామూళ్లు అందుతుండడంతో పట్టించుకోని పోలీసు, రెవెన్యూ, మైన్స్ అధికారులు ☀ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్న వైసీపీ నేతలు**

శ్రీకాకుళం/ఆమదాలవలస, జులై 28 (వార్త): లెక్కకుమించి భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు.. వందలాది వాహనాల్లో పరిమితికి మించి ఇసుక తరలింపు.. బిల్లులంతా నకిలీవే.. ఎవరైనా అడిగితే.. ప్రభుత్వం మాది.. మా ఇష్టం.. ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఏం మా నేతకు చెప్పాలా.. అంటూ నిర్లక్ష్యపు సమాధానం.. కొత్త వారు ఎవరైనా ర్యాంపు వద్ద కనిపిస్తే బెదిరింపులు.. ఇది పురుషోత్తపురం ర్యాంపులో కొందరు టీడీపీ గూండాల అరాచకం, రౌడీయిజం.. పోలీసులు, మైన్స్, రెవెన్యూ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నాం.. వారెవరూ మమ్మల్ని టచ్ చేయడం లేదు.. మీరేంటి.. మీకు ఇక్కడ పనేంటి అంటూ గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు కూడా పురుషోత్తపురం ర్యాంపు వద్దకు చేరుకోకుండా కట్టడి చేస్తున్నారు.. కొందరు టీడీపీ నేతలు. మునగవలసకు చెందిన ఓ నాయుడు, పురుషోత్తపురంనకు చెందిన ఓ రాజు.. ఈ ర్యాంపులో పాత్రధారులు. సూత్రధారులు వేరే ఉన్నారనుకోండి.. వారి అండ చూసుకొని వీరు పేట్రేగిపోయి వంశధార నదిలో ఇసుకను తోడేస్తున్నారు. ఎవరైనా అడిగితే వీరు, వీరి అనుచరులు చేయిచేసుకుంటుండడంతో మనకెందుకులే అని మిన్నకుంటున్నారు.

### అధ్వానంగా రహదారులు..

పురుషోత్తపురం ర్యాంపు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఇసుక లారీలు విశాఖ వైపు పరుగులు తీస్తుంటాయి. ఒక్కో లారీ 60 నుంచి 70 టన్నులు ఇసుక తరలిస్తుండడంతో ఆమదాలవలస, శ్రీకాకుళం వెళ్లే రహదారితో పాటు కొత్త రోడ్డు మీదుగా విశాఖ వెళ్లే సర్వీసు రోడ్లు గోతులు పడ్డాయి. మరికొన్ని చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ రహదారి మీదుగా వెళ్లే వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

### ర్యాంపు ఆవరణలో ఇసుక పోగులు

వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడితే నదిలోకి వరద వచ్చే అవకాశం ఉన్నందున ఇసుక తోడేస్తున్న వారు ముందు జాగ్రత్తగా ఇసుకను ర్యాంపు ఆవరణలో పెద్ద ఎత్తున పోగులు పోస్తున్నారు. ఈ పోగులను చూస్తే కొండ మాదిరిగా కనిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ర్యాంపు నిర్వాహకులు వ్యవహరిస్తున్నా మైన్స్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### మారిన నది ప్రవాహ దిశ..

వంశధార నదిలో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా తవ్వకాలు వల్ల నీటి ప్రవాహ దిశ మారుతోంది. నదీతీర ప్రాంత గ్రామాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయి నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ముమ్ముందు తీవ్ర నీటి ఇక్కట్లకు గురయ్యే అవకాశం ఉందని, వరద వస్తే మా గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, పురుషోత్తపురం ర్యాంపు సమీప నదీ తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### చోద్యం చూస్తున్న అధికారులు..

నకిలీ బిల్లులతో పరిమితి మించి బరువుతో ఇసుకను లారీల్లో తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోరు. తమ కళ్లముందే లారీలు వెళుతున్నా.. ఉన్నతాధికారుల ఆదేశాలు, అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో వారు కళ్లుమూసుకుంటున్నారు. నెలవారీ మామూళ్లు అందుతుండడం కూడా ఒక కారణం అయివుంటుందన్న విమర్శలు ఉన్నాయి.

### ఫిర్యాదులు బుట్టదాఖలు..

పురుషోత్తపురం ర్యాంపులో ఇసుక అక్రమ తవ్వకాలు.. తరలింపుపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు మీడియా ముఖంగా పలుమార్లు తన ఆవేదనను వ్యక్తం చేశారు. కలెక్టరే స్పందించకపోతే.. ఇంకా ఎవరికి తాము ఫిర్యాదు చేసుకోవాలని వాపోతున్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నారు.




ఇసుక, క్వారీ నిర్వాహకుడు రామినాయుడు ఎవరు? ఏంటీ కథ? ఆయన పాత్ర ఏంటి? ఆయన ఎవరిని చూసుకుని పేట్రేగిపోతున్నాడు? ఆయన చేస్తున్న పనేంటి? ఆయనపై సొంత గ్రామస్థులు చేస్తున్న ఆరోపణలు ఏమిటి? ఎవరెవరిని మేనేజ్ చేస్తున్నాడు? నెలవారీ మామూళ్లు ఎవరికి ఎంతెంత ఇస్తున్నాడు? అనుచరుల దందా ఎలా సాగుతోంది.. తదితర సమగ్ర వివరాలతో త్వరలో 'జాతీయ వార్త'లో కథనం..

# మెగా కాదు.. దగా డీఎస్సీ

**☀ డీఎస్సీ నిర్వహణలో అక్రమాలపై సీబీఐ విచారణ చేయించాలి ☀ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన కూటమి ప్రభుత్వం ☀ వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి ☀ యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలి ☀ మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ☀ కలెక్టరేట్‌కు వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ ☀ అడ్డుకున్న పోలీసులు ☀ పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట ☀ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శన**

శ్రీకాకుళం, జులై 28 (వార్త): కూటమి ప్రభుత్వం నిర్వహించింది.. మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని, కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందని మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యా రంగంలో వైఫల్యాలకు నిరసనగా వైసీపీ అధిష్టానం పిలుపుమేరకు విద్యార్థి యువత.. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించింది. పోలీసుల ఆంక్షలు, దిగ్బంధనాలను దాటుకుని జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. కలెక్టరేట్ రహదారిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం వద్దకు చేరుకున్నారు. ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. నిరసన ప్రదర్శనలకు ఎలాంటి ముందస్తు అనుమతి లేదని, చట్టభద్రత దృష్ట్యా సహకరించాలని నేతలకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి యువతకు న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును కూడా పోలీసులు అడ్డుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, సాడే శ్యాంప్రసాద్ రెడ్డి, యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, ధర్మాన రామమనోహర్ నాయుడు, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృధ్విరాజ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్త విజయ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి సీదిరి తనయుడికి బెయిల్

**✳ రోడ్డు ప్రమాదం కేసులో ఆరవ్ వర్మ, సిద్ధార్థకు ఊరట ✳ అప్పలరాజు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ ✳ 30న అంపోలు జైలులో సీదిరిని పరామర్శించనున్న జగన్**

పలాస, జులై 28 (వార్త): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన కేసులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తనయుడు ఆరవ్ వర్మతో పాటు సిద్ధార్థ త్యాడిలకు జిల్లా ఆరవ అదనపు న్యాయస్థానం మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇద్దరూ అంపోలు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. మంగళవారం సోంపేటలోని జిల్లా ఆరవ అదనపు న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్లపై విచారణ జరగగా, న్యాయస్థానం ఆరవ్ వర్మ, సిద్ధార్థ త్యాడిలకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. కాగా, ఈ కేసు నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 30న అంపోలు జైలులో ఉన్న సీదిరిని కలిసేందుకు రానున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కళింగసీమను పునరుద్ధరించాలి

## - 2287 ఏళ్ల చరిత్రను మరుగునపరిచారు

## - ప్రత్యేక అభివృద్ధి, ప్యాకేజీ కోసం ఉద్యమం కొనసాగిస్తాం

## -డా. దువ్వాడ జీవితేశ్వరావు

**పలాస, జులై 28 (వార్త):** "ఉత్తరాంధ్ర"కు బదులుగా చారిత్రకమైన "కళింగసీమ" పేరును అధికారికంగా పునరుద్ధరించాలని కళింగసీమ సాధన సమితి కో-కన్వీనర్ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ కళింగసీమకు వేల ఏళ్ల చరిత్ర ఉన్నప్పటికీ ఆ గుర్తింపును క్రమంగా మరుగునపరిచారని ఆయన ఆరోపించారు. సొంత చారిత్రక పేరును వదిలి "ఉత్తరాంధ్ర" అనే పేరుతో పిలవడం వల్ల ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతింటోందని ఆయన అభిప్రాయపడ్డారు. కళింగసీమ అనేది ఇచ్ఛాపురం నుంచి గోదావరి వరకు విస్తరించిన చారిత్రక, సాంస్కృతిక ప్రాంతమని డా. దువ్వాడ పేర్కొన్నారు. క్రీ.పూ.261లో జరిగిన కళింగ యుద్ధం ఈ నేలపైనే జరిగిందని, ఆ యుద్ధం అనంతరం చక్రవర్తి అశోకుడు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడని గుర్తు చేశారు. ఇంతటి చరిత్ర కలిగిన ప్రాంతాన్ని "ఉత్తరాంధ్ర" అనే పేరుతో పరిమితం చేయడం చారిత్రకంగా సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. 1953 తర్వాత పాలకులు "కళింగసీమ" అనే పేరును అధికారిక వినియోగం నుంచి తొలగించారని ఆరోపించారు.

### 1936 విభజనే వెనుకబాటుకు కారణం

1936లో జరిగిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో మహానది నుంచి గోదావరి వరకు విస్తరించిన కళింగ ప్రాంతం రెండు భాగాలుగా విడిపోయిందని డా.దువ్వాడ తెలిపారు. ఉత్తర భాగాన్ని ఒడిశాలో, దక్షిణ భాగాన్ని అప్పటి మద్రాస్ రాష్ట్రంలో విలీనం చేశారని చెప్పారు. గంజాం, పర్లాకిమిడి, కోరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి తదితర ప్రాంతాల్లో తెలుగు మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్నప్పటికీ వాటిని ఒడిశాలో కలపడం వల్ల కళింగసీమ రాజకీయ, ఆర్థికంగా బలహీనపడిందని ఆయన అభిప్రాయపడ్డారు. గుర్తింపు లేక అభివృద్ధి దూరం ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లేకపోవడం వల్ల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయిందని డాక్టర్ దువ్వాడ పేర్కొన్నారు. రాజ్యాధికారం లేకపోవడంతో ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, వైద్య సదుపాయాలు, పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు వెళ్లాయని ఆరోపించారు. సహజ వనరులు, సముద్ర తీరం, వ్యవసాయ భూములు, ఖనిజ సంపద సమృద్ధిగా ఉన్నప్పటికీ కళింగసీమ అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత పెద్దఎత్తున ఇతర నగరాలకు వలస వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కళింగ చరిత్ర, కళింగ యుద్ధం, కళింగ వీరుల త్యాగాలకు పాఠ్యపుస్తకాల్లో తగిన స్థానం కల్పించాలని దువ్వాడ కోరారు. కొత్త తరానికి కళింగసీమ చరిత్ర తెలియకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### మూడు ప్రధాన డిమాండ్లు

కళింగసీమ సాధన సమితి తరఫున మూడు ప్రధాన డిమాండ్లను దువ్వాడ ప్రకటించారు.

- అధికారిక రికార్డులు, రెవెన్యూ పత్రాలు, పాఠ్య పుస్తకాల్లో "ఉత్తరాంధ్ర" స్థానంలో "కళింగసీమ" పేరును పునరుద్ధరించాలి.

- పాఠశాల స్థాయి నుంచే కళింగ చరిత్ర, సంస్కృతి, వీరుల త్యాగాలను బోధించాలి,

-కళింగసీమకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీతో పాటు రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. త్వరలో జిల్లాల వారీగా భారీ బహిరంగ సభలు, సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

### ప్రజలకు పిలుపు

కళింగసీమ అనేది కేవలం ప్రాంతం కాదని, చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక అని దువ్వాడ పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా కళింగసీమ అస్తిత్వ పునరుద్ధరణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తమ చారిత్రక గుర్తింపును కాపాడుకున్నప్పుడే ప్రాంతానికి తగిన గౌరవం, అభివృద్ధి, హక్కులు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.



## గోతిలో పడిన శునకానికి ప్రాణదానం

### - అరగంటపాటు శ్రమించి సురక్షితంగా బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది



**పలాస, జులై 28 (వార్త):** పలాస-కాశీబుగ్గలో నిర్మాణంలో ఉన్న లోతైన గొయ్యిలో పడిన ఓ శునకాన్ని అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతంగా రక్షించారు. మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికులను కదిలించింది. స్థానికుల కథనం ప్రకారం.. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలోని లోతైన గొయ్యిలో ఓ వీధి శునకం ప్రమాదవశాత్తు జారిపడింది. బయటకు రాలేక అది మొరగడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తాళ్ల సహాయంతో ఓ సిబ్బంది గొయ్యిలోకి దిగి, సుమారు అరగంటపాటు శ్రమించి శునకాన్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రక్షణ అనంతరం శునకానికి స్వల్ప గాయాలే ఉన్నట్లు గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి మూగజీవి ప్రాణాలను కాపాడటంపై స్థానికులు అభినందనలు తెలిపారు. సేవా తత్పరతకు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రాంతాలను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా కంచెలు, హెచ్చరిక బోర్డులతో రక్షించాలని స్థానికులు కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటింటా ప్రభుత్వ పథకాల ప్రచారం



**పలాస, జులై 28 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో మంగళవారం ఇంటింటా ప్రభుత్వ పథకాల ప్రచారం నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలోని 34, 35, 36, 37 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వడ్డీ యాదగిరి, పలాస యూనిట్ కో-కన్వీనర్ ఆళ్ల కృష్ణారావు, శాసన పూరి వెంకట్రావు, తామాడ మోహనరావు, అమలకుడియ నీటి సంఘం ఉపాధ్యక్షుడు సల్లా విశ్వనాథం, గరికి కృష్ణారావు, అల్లాడ కృష్ణారావు, మణిగాం శ్రీను తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల జీఓలు వెంటనే సవరించాలి



**పలాస, జులై 28 (వార్త):** షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్ రంగంలోని కార్మికులకు సంబంధించిన కనీస వేతనాల జీఓలను తక్షణమే సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం వేకువ జామున సీఐటీయూ ఆధ్వర్యంలో పలాసలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. గణపతి మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా అనేక షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్ విభాగాల్లో కనీస వేతనాలు సవరించకపోవడంతో యాజమాన్యాల దోపిడీ పెరిగిందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల పేరుతో కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. వెంటనే వేతన బోర్డును నియమించి కనీస వేతనాల జీఓలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వెంకటి, ఎం. రవి, ఎస్. రమేష్, సి.హెచ్. మురుగన్, ప్రకాష్ ముఖి, రజేష్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా ఇంటింటికీ తెలుగుదేశం



**మందస, జులై 28(వార్త):** ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నాయకులు ప్రతిష్టాత్మతంగా నిర్వహిస్తున్నారు. అంబుగాం, దున్నవూరు, తాళ్ళగురంటి పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వివిధ గ్రామ పంచాయతీల్లో ఉత్సాహభరిత వాతావరణంలో చేపట్టినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. అంబుగాం గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్డులూరు, దున్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నొల్లూరు, అలాగే తాళ్ళగురంటి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దకోస్టా, తాళ్ళగురంటి, బలరాంపురం గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సీనియర్ నాయకులు, మండల లచ్చయ్య, బొడ్డు తిరుపతి, కుప్పిలి వెంకటరావు, మోహన్, సౌరు బాబురావు, వంక లక్ష్మీనారాయణ, సౌరు గురయ్య, ఉత్తర రుద్రయ్య, సౌరు భూపతి, బేసి ఈశ్వరరావు, గౌరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## జానకమ్మకు ఉద్దాన కళాకారుల నీరాజనం

### -అక్కుపల్లిలో జానకమ్మకు స్వరనివాళి

### -నాలుగు గంటల పాటు మధుర గీతాల సందడి

### -ఉద్దాన కళాకారుల గానామృతం

**పలాస, జులై 28 (వార్త):** గానగంధర్వి ఎస్.జానకికి ఉద్దాన ప్రాంత కళాకారులు అపూర్వ సంగీత నివాళి అర్పించారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో మంగళవారం నిర్వహించిన 'స్వర నివాళి' సంగీత విభావరి నాలుగు గంటలపాటు వీనులవిందుగా సాగి సంగీతాభిమానులను అలరించింది. శ్రీరామ సేవా సంఘం భవనంలో ఉద్దాన కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జానకి చిత్రపటానికి గ్రామ పెద్దలు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక లైటింగ్, డిజిటల్ సౌండ్ వ్యవస్థల నడుమ జానకి ఆలపించిన ఎన్నో ఆణిముత్యాల్లాంటి గీతాలను స్థానిక గాయనీగాయకులు ఆలపించి సభికులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాదరావు మాట్లాడుతూ శృతి, లయలకు సామ్రాజ్ఞిగా నిలిచిన ఎస్. జానకి తన అసాధారణ గాన ప్రతిభతో సినీ సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. డిజిటల్ సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే స్వర మాధుర్యంతో కోట్లాది మందిని అలరించారని చెప్పారు. ఆమె పాటలు వినిపించేంత కాలం జానకి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మడ్డు శంకర్, శిష్టు రామ్ మనోజ్‌కుమార్, కాస గీత, కోడ నాగమణి, గుంటూ జ్యోతి, జోగి పున్నయ్య, మడ్డు ఉషారాణి, విమల, లక్ష్మి, పద్మావతి తదితరులు గాన ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సేవా సంఘం కోశాధికారి కాస చలపతిరావు, సంయుక్త కార్యదర్శి మడ్డు మురళీకృష్ణ, ప్రతినిధులు సింగుపల్లి బాలకృష్ణ, కాస ముకుందరావు, సూరాడ లోకనాథం, పిన్నాసి శ్రీకాంత్, మడ్డు వాసుదేవ్, కాస సోమశేఖర్, కోనేరు లోకనాథం నాయుడు, కాస వెంకటస్వామి, మడ్డు మాలయ్య, మోస కుమారస్వామి, చొక్కర జానకిరావు, కుంది రాజా తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

# 30న జిల్లాకు జగన్

### అంపోలు జైలులో సీదిరితో ములాఖత్!


### కుటుంబ సభ్యులను కూడా పరామర్శించనున్న మాజీ సీఎం

**పలాస, జులై 28 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జూలై 30న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అంపోలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ములాఖత్ ద్వారా కలుసుకోనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీదిరి అప్పలరాజుపై నమోదైన కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని తమ పార్టీ భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ పూర్తి అండగా ఉంటుందనే భరోసా కల్పించేందుకే జగన్ ఈ పర్యటన చేపడుతున్నట్లు వెల్లడించారు. జైలులో సీదిరి అప్పలరాజును కలిసిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కూడా జగన్ సమావేశమవుతారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షపూరితంగా కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందనే సందేశాన్ని జగన్ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా శ్రీకాకుళం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపడంతో పాటు రాజకీయంగా ఎదురవుతున్న సవాళ్లను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునివ్వనున్నట్లు బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు.




# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**పలాస, జులై 28 (వార్త):** పలాస మండలం సవర గోవిందపురంలో 'ఇంటి ఇంటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామస్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద విద్యార్థులకు ఆర్థిక సాయం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారు, డయాలసిస్ బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యారంగంలో సర్వేపల్లి రాధాకృష్ణ మిషన్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విట్టల్, పలాస టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్ నాయుడు, క్లస్టర్ కన్వీనర్లు తమ్మినేని గంగారం, మురిపింటి కుమార్ రాజు, సవర సోమేశ్, ప్రభుదాస్, కుత్తుం ప్రకాష్, మాధవ, బాలయ్య, మున్నా, శాంతమ్మతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## దానయ్య కుటుంబానికి రూ.5.50 లక్షల ఆర్థికసాయం

### - గుండు సూది యూట్యూబ్ ఛానెళ్ల అధినేత శ్రీనివాస్ దాతృత్వం



**సోంపేట, జులై 28 (వార్త):** కాశీబుగ్గలో ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో సూదికొండ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మృతి చెందిన విషయం తెలుసుకొని దానయ్య కుటుంబానికి జర్నలిస్టు, గుండుసూది యూట్యూబ్ ఛానెళ్ల అధినేత మానెం శ్రీనివాస్ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న దానయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, తన యూట్యూబ్ ఛానెళ్ల ఫాలోవర్స్ స్వచ్ఛందంగా అందించిన రూ.5.50 లక్షల విరాళాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఆ మొత్తాన్ని మృతుడి భార్య ద్రౌపతి పేరుతో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమ చేయించి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మానెం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఫాలోవర్స్ అందించిన సహకారంతో బాధిత కుటుంబానికి కొంతైనా భరోసా కల్పించగలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఈ సందర్భంగా మానెం శ్రీనివాస్‌తో పాటు ఆర్థిక సహాయం అందించిన యూట్యూబ్ ఛానెళ్ల ఫాలోవర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే గారూ... చర్చకు మేము సిద్ధం

### - వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి



**సోంపేట, జులై 28 (వార్త):** మత్స్యకార సామాజిక వర్గీయులు కోసం వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి టిడిపి ప్రభుత్వం దశాబ్దాలుగా చేసిన అభివృద్ధి ఏమిటా అన్నది బహిరంగంగా చర్చించేందుకు వైసీపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ ఇచ్ఛాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మీడియా ముఖంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ చర్చకు ఆహ్వానించడం పట్ల శ్యాం ప్రసాద్ రెడ్డి స్వాగతించారు. చర్చ జరిగే ప్రదేశం సమయం ఎమ్మెల్యే అశోక్ ప్రకటిస్తే పాల్గొనేందుకు తమ సిద్ధంగా ఉన్నామని అన్నారు.

## నా భర్త ఆచూకీ తెలపరూ..!

### - సీఆర్పీఎఫ్ జవాన్ భార్య ఆవేదన



**సరుబుజ్జిలి, జులై 28 (వార్త):** సరుబుజ్జిలి మండలం బప్పడం గ్రామానికి చెందిన కొప్పల సత్యనారాయణ, సీఆర్పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 22, 2026న స్వగ్రామం నుంచి రాయపూర్‌కు విధుల్లో చేరేందుకు బయలుదేరారు. రాయపూర్ చేరుకున్న వెంటనే తన భార్య భవానికి ఫోన్ చేసి, "నేను క్షేమంగా చేరుకున్నాను, డ్యూటీకి వెళుతున్నాను" అని తెలిపారు. అయితే ఆ తర్వాత కొద్దిసేపటికే ఆయన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. అప్పటి నుంచి ఆయనతో ఎలాంటి సంబంధం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భర్త ఆచూకీ కోసం ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీకి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదని భవాని వాపోయారు. ఈ ఘటనతో కుటుంబం తీవ్ర మానసిక వేదన అనుభవిస్తోందని, పిల్లలు కూడా తండ్రి కోసం ఎదురుచూస్తున్నారని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని గతంలో మీడియా దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్న భవాని, తన భర్త ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వెంటనే 6281207572 నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాయపూర్ ప్రాంత ప్రజలకు ఈ సమాచారం చేరేలా సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించవలసిన నంబర్: 6281207572

## పాయితారిలో బోరు ప్రారంభం

**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** పాయితారి పంచాయతీలో తాగునీటి బోరు ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం ఆధ్వర్యంలో ప్రారంభించారు. సుమారు 2 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు.పంచాయతీ ప్రత్యేక అధికారి అర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ కూన విష్ణు మూర్తి చొరవతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్ రావు ఏ ఓ రామారావు టెక్నికల్ అసిస్టెంట్ రొకళ్ళ రాము,సెక్రటరీ గఫుర్, ఫీల్డ్ అసిస్టెంట్ రూప,వలపల తులసి,నిరంజన్ ,గిన్ని బాలరాజు,ప్రకాశ్ నాయక్,దక్కత రామారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# మేమున్నామని..!

- నర్తుకు అండగా.. స్పందించిన స్నేహితులు
- వెంకటరమణ కుటుంబానికి రూ.72వేల ఆర్థిక సాయం
- పూర్వ విద్యార్థుల ఔదార్యం

**మందస, జులై 28(వార్త):** స్నేహం ఓ పేద కుటుంబాన్ని ఆదుకుంది. స్నేహానికి కన్నా మిన్న లోకాన లేదురా.. అన్న ఓ సినీకవి గేయం నిజం చేసింది. స్నేహితులంతా కలసి, రూ.72వేల ఆర్థిక సాయమందించి, తమ ఉదారత చూపించారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృత్యువుతో పోరాడి, ఓడిపోయారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు, స్నేహితులు ఆ కుటుంబానికి చేతనైన సాయం చేస్తున్నారు. అయితే, తాము కూడా ఉన్నామంటూ.. మృతుడు వెంకటరమణ క్లాస్ మేట్స్ సాయం చేయడానికి ముందుకు వచ్చారు. రూ.72వేలను వెంకటరమణ కుటుంబానికి తమ వంతుగా అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్తు వెంకటరమణ అకాల మరణం చాలా బాధాకరం తన తోటి చదువుకున్న(2008-2009) స్నేహితుడు మన మధ్య లేకపోవడం చాలా దురదృష్టమని ఆయన స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి మన వంతు సహాయం ఎంతో అవసరం అంటూ ఒకరికొకరు అండగా నిలిచి, క్లాస్మెంట్ మొత్తం విద్యార్థులు 72,000 రూపాయలు జమ చేసి ఆ కుటుంబానికి అందించామన్నారు. ఆ కుటుంబ సభ్యులు సమక్షంలో వెంకటరమణ కుమార్తె భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని సుకన్య సమృద్ధి యోజన స్కీంలో ఈ డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్ లో ఏదైనా అవసరం అయితే మా క్లాస్మేట్స్ అందరం మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు చూపిన ఔదార్యానికి గొరకల పాపారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిన్నింటి శంకర్, రాపాక నరేష్, ముడిమించి వీరాస్వామి, మామిడి జానకిరావు, అందాల ఢిల్లేశ్వరరావు, ముడిమించి తిరుమల, తాళ్ళ కృష్ణవేణి, పిన్నింటి లక్ష్మి, మురపాల పవిత్ర క్లాస్ మేట్స్ తరుపున పాల్గొన్నారు.



# అక్రమ కలప రవాణాపై ఉక్కుపాదం

- రూ.2 లక్షల అపరాధ రుసుము వసూలు చేసిన అటవీ శాఖ
- అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు: ఫారెస్ట్ రేంజర్ జగదీష్



**నరసన్నపేట, జులై 28 (వార్త):** అక్రమంగా కలపను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ రూ.2 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు నరసన్నపేట ఫారెస్ట్ రేంజర్ జగదీష్ తెలిపారు. మంగళవారం నరసన్నపేట అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అటవీ సంపద పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ అక్రమ కలప రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నరసన్నపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో నరసన్నపేట, కోటబొమ్మాళి, జలుమూరు, టెక్కలి మండలాల్లో మొత్తం 11 సామిల్లులు, ఐదు టింబర్ డిపోలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వీటి పనితీరును అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది సామిల్లులు, టింబర్ డిపోల లైసెన్సులను నిబంధనల మేరకు పునరుద్ధరిస్తున్నామని, అనుమతులు లేకుండా కలప నిల్వ చేయడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అటవీ సంపదను పరిరక్షించడంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అక్రమ కలప రవాణా లేదా చెట్ల నరికివేతకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని ఫారెస్ట్ రేంజర్ జగదీష్ విజ్ఞప్తి చేశారు.

# విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

- నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని వైసీపీ విమర్శ
- శాంతియుత ర్యాలీకి బయలుదేరిన నేతలను అడ్డుకున్న పోలీసులు




**నరసన్నపేట, జులై 28 (వార్త):** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. మంగళవారం నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. మెగా డీఎస్సీ నియామకాల ప్రక్రియలో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీకాకుళంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరయ్యేందుకు కార్యకర్తలతో కలిసి బయలుదేరిన ధర్మాన కృష్ణ చైతన్యను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ నిరసన కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగానే సాగుతుందని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యక్రమంలో పాల్గొంటామని తెలిపారు. తమ లక్ష్యం ప్రజాస్వామ్యబద్ధంగా నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమేనని ఆయన పేర్కొన్నారు. అనంతరం పోలీసులతో జరిగిన చర్చల తర్వాత కార్యకర్తలు శ్రీకాకుళంలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లగా, పరిస్థితి ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# మోదీ సభ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

-నరసన్నపేట నుంచి 13 బస్సుల్లో 550 మంది తరలింపు

- ఈనెల 30న పెన్షన్ల పంపిణీ ఉంటుందని ఎంపీడీవో వెల్లడి



**నరసన్నపేట, జులై 28 (వార్త):** భోగాపురంలో జరగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నరసన్నపేట ఎంపీడీవో వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, సభకు నరసన్నపేట మండలం నుంచి ప్రజలను తరలించేందుకు 13 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 550 మంది సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, సమన్వయ ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీన సామాజిక భద్రతా పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వెంకట ప్రసాద్ వెల్లడించారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# గుండివిల్లిపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

- విద్యార్థులతో మమేకమై బోధనపై ఆరా
- హోంవర్క్, వర్క్‌బుక్స్ పూర్తిగా రాయాలని సూచన



**నరసన్నపేట, జులై 28 (వార్త):** గుండివిల్లిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల అభ్యాస పురోగతిని పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ ముందుగా విద్యార్థులతో మమేకమై వారి చదువుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకుంటూ పలు ప్రశ్నలు అడిగారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హోంవర్క్ చేయడంతో పాటు వర్క్‌బుక్స్‌ను పూర్తిగా రాయాలని సూచించారు. నిరంతర అభ్యాసం ద్వారా విద్యలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుడు కృష్ణారావుకు సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మందిరంలో
# నేడు గురు పౌర్ణమ పూజలు

**సోంపేట, జులై 28(వార్త):** సోంపేటలోని శ్రీశయన వీధిలో గల శ్రీరామకృష్ణ మందిరంలో బుధవారం గురుపౌర్ణిమ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి గరుడాచలం శంకర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, కథామృత పఠనం, నారాయణ పారాయణం, ఆధ్యాత్మిక సందేశాలు, ప్రసాద వితరణ అలాగే సాయంత్రం నుంచి భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని రామకృష్ణ పరమహంస కృపకు పాత్రులు కావాలని కోరారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**సారవకోట, జులై 28 (వార్త):** విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని శ్రీకాకుళం వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ ప్రసన్నారాణి అన్నారు. మంగళవారం సారవకోటలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా 'ఆడపిల్లలను రక్షిద్దాం... ఆడపిల్లలను చదివిద్దాం' అనే సందేశంతో బాలికల విద్య, భద్రత ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు, బాలికల స్వీయ రక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందని, వాటిపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరిగే వేధింపులు, వివక్ష, హింస వంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాలను రూపొందించిందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులకు లేదా వన్ స్టాప్ సెంటర్‌ను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. బాలికల విద్య, ఆత్మవిశ్వాసం, చట్టాలపై అవగాహన పెంపొందితేనే సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రసన్నారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు సవరించాలి



**మందస, జులై 28(వార్త):** కనీస వేతనాలు సవరించాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ పరిధిలోని రాధాకృష్ణపురంలో గల సీఐటీయు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీలో ప్రచారం చేపట్టారు.

ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ కనీస వేతనాలు లేక కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందని, వెంటనే వేతనాలు సవరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు సవరణకై జరుగుతున్న ఈ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఆర్.ఏకాశి, ఎన్.లచ్చయ్య, మోహనరావు, బి.మల్లేసు, కె.కృష్ణారావు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# రహదారులకు మహర్దశ



**జి.సిగడాం, జులై 28 (వార్త):** పెంట గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు పోలాలకు పోయె రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 6 కిలోమీటర్ల దూరాన్ని కూటమి నాయకులు మక్క నారాయణరావు ఆధ్వర్యంలో రోడ్డును పనులకు గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ హిందు గుర్తించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి తెలియజేసి రోడ్డు పనులు ప్రారంభమైయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. రైతులు పోలాలకు వెళ్లుటకు సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించేందు కూటమి ప్రభుత్వం చోరవ తీసుకుందన్నారు. నాయకులు డోల పార్వతీ, మీసాల రమణ, తదితరులు ఉన్నారు.

# దేవుపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం

-82మందికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



**మందస, జులై 28(వార్త):** నర్సింగపురం పంచాయతీ పరిధిలో గల దేవుపురం గ్రామంలో రాగోలు 'జెమ్స్' ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ యూత్ నాయకుడు చంద్రమౌళి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ఈ సేవా కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో జెమ్స్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు 82మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. పరీక్షల అనంతరం దీర్ఘకాలిక(క్రానిక్) ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు రోగులను గుర్తించి, మెరుగైన ఉచిత చికిత్స నిమిత్తం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.దుర్యోధన, ఎస్.చిన్ని, జి.హరికృష్ణ, బి.లోకనాథం, టి.శరత్, వైద్య సిబ్బంది ఎంఎల్హెచ్పీ రాణి, ఆశా వర్కర్లు పార్వతి, పద్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ ధర్నాలో జైదేవ్ యాదవ్




**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** బి.సిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలని దేశ రాజధాని న్యూ ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా లో జాతీయ బి సి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శి కాళ్ల జయదేవ్ యాదవ్ పాల్గొన్నారు- చట్ట సభల్లో బీసీ లకు 50% రిజర్వేషన్ అమలు చెయ్యాలని, పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ అవ్వాలని,మద్దతు తెలిపిన వివిధ పార్టీల పార్లమెంట్ సభ్యులు- కులాల వారీగా జనగనన చెయ్యాలని,- బీసీ రక్షణ చట్టం అమలుకి కృషి చెయ్యాలని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ బి .సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, ఇంచార్జ్ నూకాలమ్మ యువ నాయకులు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో డిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ధర్నా ప్రదర్శన జరిపారు. బీద మస్తాన్ రావు, పాక సత్యనారాయణ, నాగరాజు, రామారావు లు పాల్గొన్నారని తెలిపారు.

# అనాథ ఉద్యోగికి అండగా నిలిచిన లక్కీ షాపింగ్ మాల్

**పలాస, జులై 28 (వార్త):** కష్టకాలంలో ఉద్యోగికి కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచి లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. పలాసలోని లక్కీ షాపింగ్ మాల్‌లో గత మూడు సంవత్సరాలుగా సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న జ్యోతిష్‌కుమార్ చిన్నతనంలోనే తండ్రి, అక్కను కోల్పోయాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి కూడా మంగళవారం మృతి చెందడంతో అతను దిక్కుతోచని స్థితిలో నిలిచాడు. ఈ విషయం తెలుసుకున్న లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, మేనేజ్‌మెంట్ గ్రంధిశ్రీనివాస్, గ్రంధి సుబ్రహ్మణ్యం, శ్రీరామ్ రత్తయ్య, షాపింగ్ మాల్ మేనేజర్లు స్వామి యాదవ్, శంకర్ బాబు, శ్రీహరి యాదవ్ సిబ్బంది, సిబ్బంది వెంటనే స్పందించి జ్యోతిష్‌కుమార్‌కు అండగా నిలిచారు. తల్లి అంత్యక్రియలను నిర్వహించడంతో పాటు దహన సంస్కారాలకు అవసరమైన ఏర్పాట్లు చేసి ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టసమయంలో సహోద్యోగికి తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావించామని సహోద్యోగులు తెలిపారు. ఉద్యోగి పట్ల యాజమాన్యం చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.



# ఉపాధ్యాయునిలా.. విప్ అశోక్

## - కేజీవీలో పాఠ్యాంశాల బోధన
## -అదనపు భవనాల ప్రారంభోత్సవం

**కంచిలి, జులై 28(వార్త):** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బి. అశోక్ బాబు అన్నారు. కంచిలి మండలంలోని జాడపూడి గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అశోక్ బాబు ఉపాధ్యాయునిగా మారి పదవ తరగతి తరగతి గదిలోకి వెళ్లారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నోట్ బుక్ లను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి కష్టపడి కాదు, ఇష్టపడి చదువుకోవాలి. మీ కుటుంబ నేపథ్యాన్ని గుర్తుంచుకొని ఉన్నతంగా ఎదగాలి. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది" అని సూచించారు. అనంతరం పాఠశాల వసతి గృహం, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ప్రిన్సిపల్ పి.వాణికుమారితో పాటుగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరి రాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాదిన రామారావు, మాజీ సర్పంచ్ పిలక చిన్నారావు, కంచిలి మండల విద్యాశాఖ అధికారి సప్పటి శివరాం ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వాటర్ ఫౌంటెన్‌ను తలపిస్తున్న మెగా పథకం



**కవిటి, జులై 28(వార్త):** కవిటి మండలంలో కన్ను పుట్టుక జి.కరాపాడు గ్రామాల మధ్య మెగా వాటర్ స్కీం లో తాగునీరు లీక్ అవడంతో ఈ దృశ్యం వాటర్ ఫౌంటెన్ ను తలపిస్తోంది. దీంతో తాగునీరు వృధాగా బయటకు పోవాల్సి వస్తుంది. దీన్ని సరి చేయకపోవడంతో స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ఇప్పటికైనా దీన్ని సరిచేయాలని కోరుతున్నారు.

## సోషల్ వర్కర్, వ్యాపారవేత్త సేనాపతి గురుమూర్తి ఆకస్మిక మృతి

### - కన్నీటి వీడ్కోలు పలికిన ప్రజలు



**మందస, జులై 28(వార్త):** వ్యాపారవేత్త, సోషల్ వర్కర్ సేనాపతి గురుమూర్తి(60) ఆకస్మికంగా మరణించారు. మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన గురుమూర్తి ఉద్దానం నుంచి హరిపురం వచ్చి, ఇక్కడే స్థిరపడ్డారు. సామాజిక కార్యక్రమాల్లో చురకుగా ఉండే ఆయన ఎందరో సాయమందించారు. ఆధ్యాత్మిక వేత్తగా గురుమూర్తికి మంచిపేరుంది. ఇంటిలో ఉన్న గురుమూర్తికి బ్రెయిన్ స్ట్రోక్ కు గురయ్యారు. మెరుగైన వైద్యానికి కూడా అవకాశం లేకుండానే ఆయన మరణించారు. గురుమూర్తి మరణం హరిపురం, బాలిగాం, ఉద్దానంలలో తీవ్ర విషాదాన్ని నింపింది. కష్టాల్లో ఉన్న వారికి ఆదుకునే ఆయన ఇకలేరు అన్న నిజాన్ని వారు నమ్మలేకపోతున్నారు. గురుమూర్తి అంత్యక్రియలకు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆయనను చివర చూపు చూడడానికి స్నేహితులు, బంధువులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గురుమూర్తికి భార్య క్రిష్ణకుమారి, కుమారుడు శ్రీవాత్సవ ఉన్నారు. సేనాపతి గురుమూర్తి అకాల మరణం పట్ల పలువురు సంతాపం తెలిపారు.

## జర్నలిస్టులకు పెన్షన్ అమలు చేయాలి

**సోంపేట, జులై 28(వార్త):** జర్నలిస్టులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ నేతలు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును న్యూఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. అలాగే రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అందుతున్న సేవలను గుర్తు చేశారు. దీనిపై మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నేత భావన శ్రీకాంత్ తెలిపారు. గతంలో ఉన్న రైల్వే పాసుల ను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. 15 రాష్ట్రాల్లో పెన్షన్ విధానం అమలు జరుగుతుందని గుర్తు చేశారు. స్వర్గీయ సుష్మా స్వరాజ్ గతంలో పార్లమెంట్ వేదికగా జర్నలిస్టుల పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మీడియా కమిషన్ ఏర్పాటు అవసరాన్ని పార్లమెంట్లో చర్చించి చట్టంగా తయారు చేయాల్సిన ఆవశ్యకతను నాయకులు వివరించారు. ఈ అంశాలపై కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటు దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.ఈశ్వరరావు, ఎంవీ మల్లేశ్వరరావు, భావన శ్రీకాంత్, కళ్యాణ్ చక్రవర్తి, హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.





## విభిన్న ప్రతిభావంతులకు సహాయక పరికరాల పంపిణీ

### - భవిత కేంద్రంలో వీల్‌చైర్లు, వినికిడి యంత్రాల అందజేత
### - అర్హులైన గుర్తించి ప్రయోజనాలు కల్పించాలని సూచన

**సారవకోట, జులై 28(వార్త):** సారవకోటలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు పలు సహాయక పరికరాలను పంపిణీ చేసినట్లు ఐఈడీ ఉపాధ్యాయులు పూర్ణిమ, సంధ్యా తెలిపారు. మంగళవారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మద్దు వెంకటరమణ చేతుల మీదుగా అర్హులైన దివ్యాంగులకు ఈ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐఈడీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, దివ్యాంగుల దైనందిన జీవనాన్ని సులభతరం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పంపిణీలో భాగంగా ఆరు వీల్‌చైర్లు, తొమ్మిది వినికిడి యంత్రాలు, రెండు టి.ఎల్.ఎమ్ (టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్) కిట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. మండల పరిధిలో ఇంకా సహాయక పరికరాలు అవసరమైన విభిన్న ప్రతిభావంతులను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఉపాధ్యాయులు కోరారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, భవిత కేంద్రం సిబ్బంది, లబ్ధిదారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పీఎం సభను విజయవంతం చేయాలి



**సారవకోట, జులై 28 (వార్త):** వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్న ప్రధానమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సారవకోట మండలం ప్రత్యేక అధికారి లోకనాథం సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లను పూర్తి చేయాలని, గ్రామాల వారీగా సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సభ వివరాలను తెలియజేయాలని సూచించారు. సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతి శాఖ సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మోహన్ కుమార్ పాల్గొని సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

## పంటల బీమా నమోదు చేసుకోవాలి

**మెళియాపుట్టి, జులై 28 (వార్త):** ప్రతి రైతు తన పండించే పంటకు పంటల భీమా నమోదు చేసుకోవాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు వై. శారద అన్నారు. మెలియాపుట్టి మండలంలో పూలసార, గంగరాజుపురం తదితర గ్రామాలలో వ్యవసాయ అధికారి దానకర్ణుడు నేతృత్వంలో మంగళవారం నాడు జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలోని క్షేత్ర పరిశీలన చేసి రైతులతో సమావేశమై ప్రస్తుతం ఉన్న నేపథ్య పరిస్థితుల్లో రైతులకు తగు సలహాలు సూచనలు తెలియజేస్తూనే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రతి రైతు కూడా వరి పంటకు పంటల భీమా చేసుకోవాలని తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి తెలియపరిచారు. పంటల భీమా నమోదు చేసుకునేందుకు 2026 ఆగస్టు 15 తేదీ లోగ నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ ఖరీఫ్ లో వరి సాగు చేస్తున్న ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పంటల భీమా నమోదు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల తదితర వాటివల్ల కలిగే పంట నష్టాలను పంటల భీమా చేసుకోవడం వల్ల రైతులు పంటల భీమా పొందుతారన్నారు. బ్యాంకులో లోను తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా అలాగే బ్యాంకులో లోను తీసుకోకపోయిన రైతులు మీసేవ/సిఎస్సి సెంటర్ల ద్వారా పంటల భీమా నమోదు చేయించు కోవచ్చునని, వరి పంటకి ఎకరాకి 160 రూపాయలు భీమాగా చెల్లించాలన్నారు. పంటల భీమా విషయంలో రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక రైతు సేవ కేంద్రాన్ని లేదా మండల వ్యవసాయధికారిని సంప్రదించాలన్నారు. అనంతరం మెలియాపుట్టి మండలంలో ఉన్న బ్యాంకుల మేనేజర్లను సంప్రదించి లోన్ తీసుకున్న రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఎన్రోల్మెంట్ చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి దానకర్ణుడు, ప్రజా ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది, కూటమి నాయకులు, రైతులు తదితరులున్నారు.





## మెళియాపుట్టి కేజీబీవీలోకి అడవి పందులు

### - భయాందోళనలో సిబ్బంది, విద్యార్థులు



**మెళియాపుట్టి, జులై 28(వార్త):** మెళియాపుట్టిలోని కేజీబీవీకి కాంపౌండ్ వాల్ ఉన్నప్పటికీ కూడా కొండ ప్రాంతం నుంచి మంగళవారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోకి అడవి పందులు ప్రవేశించడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య ఈ విషయమై మండల అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా అటవీ శాఖ అధికారులను సమాచారం తెలియపరచడంతో పాతపట్నం నుండి అటవీశాఖ నుండి బీట్ ఆఫీసర్ ప్రవీణ్ తక్షణం కేజీబీవీ పాఠశాలకు చేరుకున్నారు. ఆయనతోపాటు ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా, డిప్యూటీ తాసిల్దార్ రాము, డిప్యూటీ ఎంపీడీవో అప్పయ్య, పాఠశాల ప్రిన్సిపల్ రమ్యలు పందులు వచ్చే ప్రాంతం దగ్గరికి వెళ్లి పరిశీలించారు. అటవీ జంతువులు ఏవి రాకుండా తమకు రక్షణ కల్పించాలని అక్కడికి వచ్చే అధికారుల దృష్టికి పాఠశాల ప్రిన్సిపల్ రమ్య తెలియపరచడంతో ఇద్దరు గార్డులను ప్రస్తుతానికి నియామకం చేశారు. అటవీ జంతువులేవి ఈ ప్రాంతంలోకి రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ రమ్యతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు కోరుతున్నారు. పాఠశాలకు సందర్శించిన అధికారులు తోపాటు టిడిపి నాయకులు బస్వ పరమేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## కూటమి ప్రభుత్వ సంక్షేమం ప్రతీ ఇంటికీ చేరాలి



**మందస, జులై 28(వార్త):** బుడార్సింగి గ్రామ పంచాయతీ పరిధిలోని బిరుబడియాలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంఛార్జ్ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి నాయకులు ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ పాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, క్లస్టర్ ఇంఛార్జ్ కొర్ల కన్నారావు, క్లస్టర్ కో-ఇంఛార్జ్ బేసి ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రట్టి లింగరాజు, మెట్ట మహేశ్వరరావు, దేబాసిస్ పండా, మహానాయకో రమో, సంతోష్ గౌడ, బౌరి, పూడియ సన్యాసి, మహానయకో పాండవో, అనిల్ మాలిక్, బృందావన గౌడలతో పాటు పలువురు ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు సీఐఎఫ్ పార్కుతో రైతులకు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఊతం

**పలాస, జులై 28 (వార్త):** చిత్తూరు జిల్లాలో పండ్లు, కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కోసం ఏర్పాటు చేసిన సమీకృత కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీ (సీఐఎఫ్) పార్కును ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు మంగళవారం సందర్శించారు. యూనిట్‌లోని ప్రాసెసింగ్ కార్యకలాపాలు, సామర్థ్యం, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్ విస్తరణ అవకాశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, పల్ప్ ఎక్స్‌ట్రాక్షన్ కోసం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ కేంద్రం కొన్నేళ్లుగా నిలిచిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఈ-టెండరింగ్ ద్వారా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ఆపరేటర్‌ను ఎంపిక చేయడంతో యూనిట్‌ను విజయవంతంగా పునఃప్రారంభించగలిగామని తెలిపారు. సీఐఎఫ్ పార్కు పునరుద్ధరణతో రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందే అవకాశాలు పెరిగాయని చెప్పారు. పండ్లు, కూరగాయలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే అవకాశాలు విస్తరించాయని వివరించారు. దీంతో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి రైతుల ఆదాయాన్ని పెంచడం, ఎగుమతులను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వజ్జ బాబూరావు చెప్పారు. ఆ దిశగా చిత్తూరు సీఐఎఫ్ పార్కు కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు. అనంతరం యూనిట్‌లోని పల్ప్ ఎక్స్‌ట్రాక్షన్, ప్రాసెసింగ్, నిల్వ, నాణ్యత నియంత్రణ విభాగాలను పరిశీలించిన ఆయన రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సదుపాయాలను విస్తరించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తాజా ఫుడ్ ప్రాసెసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వర్ నాథ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546